

దళారీకి కమీషన్.. రైతన్న పరేషాన్

ఆరుగాలం కష్టపడి పండించిన టమాట పంట దళారుల పాలవుతోంది. జాక్ పాట్ పేరుతో వ్యాపారులు కుమ్మక్కై అన్నదాతను నిలువు దోపిడీ చేస్తున్నారు. -8లో



కీచక ఉపాధ్యాయుడు అరెస్టు

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు పరచాల్సిన ఉపాధ్యాయుడే.. కీచకుడిగా మారాడు. 13 ఏళ్ల విద్యార్థిని మాయ చేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.360
రెండోరకం	రూ.210	రూ.278

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 750 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	505	522
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 383.080 కిలోలు

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీద్వారా రూ. 14,05,500 ఆదాయం వచ్చింది. గత ముడునెలలకు సంబంధించి గురువారం టీటీడీ ఏఈఓ గోపినాథ్ ఆధ్వర్యంలో ఆలయంలో హుండీఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ. 14,05,500లు ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.

1579 మంది విద్యార్థులు గైర్హాజరు

రాయచోటి: జిల్లాలో జరిగిన పది సప్లిమెంటరీ పరీక్షలకు 1579 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలలో 3538 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. 1959 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి, స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ వాయిదా

రాయచోటి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పు చేస్తూ వాయిదా వేసినట్లు రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమల్లో ఉండటం వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. వాయిదా వేసిన షెడ్యూల్ మార్పు ప్రకారం ఆన్‌లైన్ ఫీజ్ చెల్లింపు, సర్టిఫికెట్ వెర్ఫికేషన్ వంటి ప్రక్రియ జూన్ 2వ తేది వరకు ఉంటుందని తెలిపారు. జూన్ 3వ తేది జరగాల్సిన వెరిఫికేషన్ 6వ తేదికి (ప్రత్యేక కేటగిరికి సంబంధించిన వారు కూడా) వాయిదా వేసినట్లు తెలిపారు. జూన్ 7 నుంచి 10వ తేది వరకు ఆప్షన్ల నమోదు ఉంటుందన్నారు. 11వ తేది ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తామన్నారు. 13వ తేది సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపా రు. జూన్ 14వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభం అవుతాయని, అలాగే సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 19వ తేది లోగా ఆయా కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు.

వికసించిన మే పుష్పాలు



వికసించిన మే పుష్పాలు



రైల్వేకోడూరు: రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్లవారిపల్లెలో పంజం విజయరంగారెడ్డి ఇంటి ఆవరణలో మే పుష్పాలు వికసించాయి. లిల్లీ జాతికి చెందిన ఈ దుంపరకం మొక్క ఏడాదిలో మే నెలలో మాత్రం వికసిస్తుంది. ఈ మొక్కను ఒకసారి నేలలో పాతితే చనిపోవడమంటూ ఉండదని విజయరంగారెడ్డి చెబుతున్నారు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుందని, ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో వికసిస్తుందని తెలిపారు. మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు 20 రోజులు పడుతుందన్నారు. 20 సంవత్సరాలుగా తమ ఇంటి ఆవరణలో మే పుష్పాలు వికసిస్తున్నట్లు విజయరంగారెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం



కడపలోని అంధుల ప్రభుత్వ పాఠశాల

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి ప్రవేశం కోసం అంధ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హెడ్‌మాస్టర్ ఎం. శంకరయ్య గురువారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఏ ప్రాంతం నుంచైనా ఈ ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఇందులో చేరిన వారికి ఎలాంటి ఫీజులు లేవని, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇస్తారని, మ్యూజిక్‌లో ప్రత్యేక శిక్షణ, కో ఎడ్యుకేషన్‌లో విద్యాభ్యాసం ఉంటుందని వివరించారు. బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందని తెలిపారు. పుట్టుకతో లేదా మధ్యలో అంధత్వం కలిగిన విద్యార్థులకు వారి స్థాయిని బట్టి ఆయా తరగతుల్లో చేర్చుకుని ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. దీంతోపాటు వారికి బ్రెయిలి లిపి నేర్పిస్తానని చెప్పారు. జూన్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ఇందులో చేరే విద్యార్థులు సదరం చేత ధ్రువీకరించిన మెడికల్ సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, మూడు ఫోటోలు జతపరిచి పంపాలన్నారు. మరింత సమాచారం కోసం 9291306870, 8328375357 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వనితర సాధ్యాలు!

'ఆమె'.. ఇంటికి దీపపై వెలుగిస్తుంది..
కంటికి రెప్పలా మారి అడవి తల్లినీ రక్షిస్తుంది..
'ఆమె'.. పిల్లి అలికిడికి భయపడే పిరికి అబల కాదు.. పులి అడుగుల్లో నడిచే గుండె ధైర్యమున్న సబల.. అవును.. వారంతా మగువలు..
అయితేనేం.. టన్నులకొద్దీ తెగువ ఉన్నవారు..
మసకేసిన మబ్బుల్ని.. 'కాన'రాని చీకట్లను
చీల్చుకుంటూ కాంతి రేఖలా మెరుస్తున్నారు.
మాటేసిన ప్రమాదాలకు.. కాటేసే వేటగాళ్లకు
ఎదురెళ్లడానికి అస్సలు వెనకడుగు వేయరు.
ప్రకృతికి ప్రణమిల్లి అడుగు ముందుకేశారు..
ఇంటి గడప దాటి అడవి తల్లి ఒడిలోని
కలపకు కాపలా కాస్తున్నారు..
నిలువెల్ల కన్నులతో పహారా కాస్తూ..
'వనిత'ర సాధ్యులమని నిరూపిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈమె పేరు నాగమణీశ్వరి. జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలను నిర్వర్తిసున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం పరిరక్షణలో భాగంగా దట్టమైన అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈమె ఒక్కరేనా అంటే కాదు ఏబీఓ, ఎఫ్‌బీవో తదితర హోదాల్లో పదుల సంఖ్యలో మహిళా మణులు అడవి తల్లి సేవలో తరిస్తున్నారు.



శేషాచలం అడవిలో విధుల నిర్వహణలో అటవీశాఖ మహిళా సిబ్బంది

- అటవీశాఖలో మగువల తెగువ
- వివిధ బాధ్యతల్లో తమదైన ముద్ర
- వన్యప్రాణుల, అడవుల సంక్షణలో 'ఆమె' కీలకం
- సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటూ ముందడుగు

రాజంపేట: కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి నిలయమైన తిరుమల క్షేత్రంగా విస్తరించబడిన శేషాచలం అటవీ ప్రాంతం జిల్లాలో కూడా విస్తరించి ఉంది. జిల్లాలో రాజంపేట, చిట్వేలి, బాలపల్లె, రైల్వేకోడూరు, సానిపాయి, మదనపల్లె, పీలేరు రేంజ్‌లలో మహిళలు వివిధ స్థాయిలో శాఖపరంగా పురుషులతో సమానంగా సేవలందిస్తున్నారు. అరుదైన జంతుజాలం, వృక్షజాలంతో నిలయమై.. చిరుత పులులు, ఎలుగుబంట్లు వంటి క్రూరమృగాలతో పాటు శేషాచలం (బయోస్పియర్)ప్రాంతంలో ఉద్యోగం అంటే ఎవరైనా భయపడాల్సిన పరిస్థితి. అటువంటి కారడవుల్లో మహిళలు ఆత్మస్థైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు సాగుతున్నారు. వనితర సాధ్యులమని నిరూపిస్తున్నారు. అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో తమదైన ముద్రవేసుకుంటున్నారు. బిడ్డలను తల్లి కంటికి రెప్పలా రక్షించుకున్నట్లుగా వనాలను సంరక్షిస్తున్నారు.

జిల్లా అటవీశాఖ నైసర్గిక స్వరూపం ఇలా..

జిల్లాలో ఎనిమిదిరేంజ్‌లు ఉన్నాయి. శేషాచలం, పెనుశిల అభయారణ్యాలలో దట్టమైన అటవీ ప్రాంతాలున్నాయి. శేషాచలం 1.23 లక్షలహెక్టార్లు, పెనుశిల అభయారణ్యం 23వేల హెక్టార్లు విస్తరించబడివుంది. వన్యప్రాణులు ఉన్న ప్రాంతం 3.1 మిలియన్ల హెకార్లు విస్తరించి ఉంది.

అటవీశాఖ: అన్నమయ్య జిల్లా

రేంజ్: 8

శేషాచలం: 1.23 లక్షల హెక్టార్లు

పెనుశిల అభయారణ్యం: 23 వేల హెక్టార్లు

వన్యప్రాణులు ఉన్న ప్రాంతం: 3.1 మిలియన్ల హెక్టార్లు



శేషాచలం

సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటూ..

జిల్లా అటవీశాఖ పరిధిలో.. అదీ శేషాచలం అటవీ ప్రాంతంలో మహిళలు ఉద్యోగం చేయడం కత్తిమీద సాములాంటిదే. కానీ విధి నిర్వహణలో తమకు ఎదురైన సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటు ముందుకు వెళుతున్నారు. అటవీభూములు పరిరక్షణలో సింహాలై గర్జిస్తున్నారు. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తన్న మహిళలు, కష్టసాధ్యమైన ఈ పనిలో ధైర్యంగా అడుగేస్తున్నారు. శేషాచల, లంకఅభయారణ్యాలులో వివిధ రేంజల పరిధిలో వివిధ హోదాలలో తమ సేవలను అందిస్తున్నారు.శేషాచలం, పెనుశిల అభయారణ్యం, హార్సిలీహిల్స్, రాయచోటి తదితర అటవీ ప్రాంతాల్లో మహిళలు తమ విధులను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎఫ్‌బీవో, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌డీఆర్వో, ఎఫ్ఆర్వో తదితర ఉద్యోగాలలో 22 మంది మహిళలు జిల్లా అటవీశాఖ పరిధిలో తమ విధులను నిర్వరిస్తున్నారు.

పురుషులతో సమానంగా విధులు



అటవీశాఖలో పురుషులతో పాటు సమానంగా విధులు చేయాల్సి ఉంటుంది. పురుష ఉద్యోగులతో సమానంగా రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో అడవిలోకి ఒంటరిగా కూడా వెళ్లాల్సి ఉంటుంది. అటవీశాఖలో పనిచేయడం అదృష్టమే.

–సుబ్బలక్ష్మి, రైల్వేకోడూరు రేంజ్

వన్యప్రాణులపై మమకారం



వన్యప్రాణులు, చెట్లపై మమకారంతో అటవీశాఖలో చేరాను. ఎఫ్‌బీవోగా పనిచేస్తున్నారు. టీ.సుండుపల్లె బీట్‌లో విధులు నిర్వరిస్తున్నాను. కంటికిరెప్పలా అడవిని సంరక్షించుకుంటున్నాం. అటవీ గ్రామాల ప్రజలు మంచివారు. వారితో కలిసి సఖ్యతగా ఉంటూ , అటవీసంరక్షణలో వారి సహకారం తీసుకుంటున్నాం.

–బీ.లక్ష్మీప్రసన్న, ఎఫ్‌బీవో, సుండుపల్లె బీట్

కష్టమైనా ఇష్టంగానే..



మదనపల్లె రేంజ్‌లో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. అటవీ సంరక్షణపై మక్కువతో విధులు బాధ్యతయుతంగా నిర్వర్తిస్తున్నాను. అటవీసంరక్షణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులలో తాను ముందుకెళుతుంటాను. విధి నిర్వహణలో ఒక్కోసారి కష్టంగా ఉంటుంది. అయినా ఇష్టంగానే విధులు నిర్వరిస్తుంటాను.

–దీప, ఎఫ్‌బీవో, తవలంబీట్, మదనపల్లె రేంజ్

ఎంతో ధైర్యం వచ్చింది



వాల్మీకిపురం, హార్సిలీహిల్స్, పుంగునూరు అటవీప్రాంతాల్లో పనిచేయడంతో ఎంతో ధైర్యం వచ్చింది. అర్ధరాత్రైనా అవలీలగా ఎక్కడికైనా వెళ్లి ధైర్యంగా విధులు పూర్తి చేసుకుంటున్నాం. అటవీ ప్రాంతాలలో ఒకొక్కసారి సెల్‌ఫోన్లు సిగ్నల్స్ కూడా సక్రమంగా అందవు. ఇంటికి సమాచారం కూడా చెప్పలేని పరిస్థితులు. చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తుంటాయి. ప్రాణాలను ఫణంగా పెట్టి చిత్తశుద్ధితో విధులు నిర్వరిస్తున్నాం.

–సీ.శోభారాణి, ఎఫ్‌బీఓ, మదనపల్లె రేంజ్

ఎర్రచందనాన్ని పరిరక్షించాను



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నేను అటవీశాలో 2010లో ఏబీవోగా చేరాను. కోడూరు, చిట్వేలి, రాజంపేట రేంజ్‌లలో పని చేశాను. ప్రస్తుతం ఎఫ్‌బీవోగా సానిపాయి రేంజ్‌లో ముడుంపాడులో పనిచేస్తున్నాను. ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టే విధులలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధులు నిర్వహించాను. అటవీశాఖలో పనిచేసే అవకాశం కలగడం మహాభాగ్యం.

–ఏ.అంజనాస్వాతి, ఎఫ్‌బీవో, సానిపాయిరేంజ్, సుండుపల్లె

చిత్తశుద్ధితో కౌంటింగ్ విధులను నిర్వహించాలి

కలెక్టర్, ఎన్నికల సంఘం ఎం.అభిషిక్త్ కిషోర్



కౌంటింగ్ నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అప్పగించిన కౌంటింగ్ విధులను చిత్తశుద్ధితో బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులతో కౌంటింగ్‌లో అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాఫీగా నిర్వర్తించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వివిధ అంశాలలో ప్రతి అధికారి నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు, వీరితో పాటు వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించాల్సిన అధికారులు సిబ్బంది అందరికీ ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంట్ సెగ్మెంటు నుంచి రౌండ్ వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు మీడియా కేంద్రానికి పంపాలని సంబంధిత ఆర్‌ఓలను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ జరుగుతున్న హాలులోకి అనుమతించిన వారు తప్ప ఎవ్వరు మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదన్నారు. విధులను బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. జూన్ 4న ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి మూడవ దశ ర్యాండమైజేషన్ చేస్తారన్నారు. జూన్ 1వ తేదీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, 3వ తేదీ కౌంటింగ్ ప్రక్రియపై ట్రయల్ రన్ నిర్వహించి లోటుపాట్లను గుర్తించి సరి చేసుకోవాలని సూచించారు. వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రిటర్నింగ్ అధికారులు రంగస్వామి, హరిప్రసాద్, మోహన్‌రావు, రాఘవేంద్ర, లీలారాణి, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ నరసింహరావు, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు, ఏఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపుపై అవగాహన ముఖ్యం



మాక్ కౌంటింగ్ శిక్షణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి

రాయచోటి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి

రాయచోటి: కౌంటింగ్ సిబ్బందికి ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాయచోటి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి సిబ్బందికి సూచించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఓట్ల లెక్కింపుపై (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జూన్ 4వ తేది ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు మొదలవుతుందన్నారు. తరువాత ఈవీఎం ఓట్ల లెక్కింపును ప్రారంభించాలన్నారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే ఓట్ల లెక్కింపునకు రాజంపేట పార్లమెంట్, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది అందరూ ఉదయం 5 గంటలకే లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రతి టేబుల్‌కు ఒక ఏఆర్‌ఓ, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈవీఎం కౌంటింగ్ నిమిత్తం ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమీషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, ఈసీ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు లెక్కించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు, డీపీఓ ధనలక్ష్మీ, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ నరసింహ కుమార్, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ క్లాసులకు వేళాయె!

- ప్రారంభమైన ఇంటర్ ప్రవేశాలు
- జూన్ 1 నుంచి 15 వరకు రెండో విడత ప్రవేశాలు



మదనపల్లె సీటీఎం జెడ్పీ హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ అధ్యాపకులు



మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ

మదనపల్లె సిటీ: కాలేజీకి వెళ్లే సమయం ఆసన్నమైంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు సమయం వచ్చేసింది. అవును.. ఇంటర్ కళాశాలలు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని విద్యార్థులకు పిలుపునిస్తూ జూనియర్ కాలేజీల అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. కళాశాలల్లో ఉన్న వసతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు మొదటి విడత ప్రవేశాలు పూర్తయ్యాయి. రెండో విడత జూన్ 1 నుంచి 15వతేదీ వరకు చేపట్టనున్నారు. జూన్ 1 నుంచి తరగతులు నిర్వహణకు కార్యచరణ చేపట్టారు.

'ప్రైవేటు'కు దీటుగా ప్రచారం: ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఆయా యాజమాన్యాలు సిబ్బందితో ప్రచారం నిర్వహించడం పరిపాటిగా మారింది. అయితే వారికి దీటుగా ఇప్పుడు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సైతం ప్రభుత్వ, వివిధ సంక్షేమశాఖల పరిధిలోని కాలేజీల్లో ప్రవేశాల పెంపుదలకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. కాలేజీలో సాధించిన పరీక్ష ఫలితాలు, వసతులు, అందిస్తున్న కోర్సుల వివరాలు కరపత్రాలు ద్వారా వివరిస్తున్నారు. గ్రామాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ అధ్యాపకులు మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు . హైస్కూల్ ప్లస్‌గా మారిన మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు వివరిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ కాలేజీలు:	24
కేజీబీవీలు:	22
మోడల్ స్కూల్ కాలేజీలు:	16
హైస్కూల్ ప్లస్:	5

కాలేజీల్లో మెరుగైన సౌకర్యాలు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కాలేజీల్లో నాడు–నేడు కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పలు సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ప్రతి కాలేజీల్లో అనుభవం కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, ఆధునాతన ల్యాబ్‌లు, క్రీడామైదానాలు, మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఉన్నాయి. వాటితో పాటు బస్ పాస్ సౌకర్యం, హాస్టల్ వసతి, స్టడీ అవర్స్ నిర్వహణతో పాటు విద్యార్థుల్లో సేవాభావం పెంచేందుకు ఎస్ఎస్ఎస్ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం



కాలేజీలో అడ్మిషన్ల పెంపునకు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాం ప్రతి రోజూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి కళాశాలలో వసతుల గురించి వివరించడంతో పాటు కాలేజీలో చేరే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కోర్సుల వివరాలు, సీట్ల సంఖ్య తదితర వాటిపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

–బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్‌కాలేజీ,మదనపల్లె

క్రికెట్ జట్టుకు ఎంపిక



పనికెల వరుణ్

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల గిరి నగర్‌కు చెందిన పనికెల వరుణ్ అండర్ 19 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇతను చిత్తూరు జిల్లా జట్టు తరపున ఆడుతున్నాడు. అనంతపురంలో జరిగే నాలుగు జిల్లాల (కర్నూలు, కడప, నెల్లూరు, అనంతపురం) టోర్నమెంట్‌లో పాల్గొంటాడు.ఈ టోర్నీ ఈ నెల 28 నుంచి ప్రారంభమైంది.జూన్ 3 వరకు జరుగుతుంది. శుక్రవారం అనంతపురం జట్టుతో, ఆదివారం నెల్లూరు, మంగళవారం కర్నూలు జట్లతో జరిగే మ్యాచ్‌ల్లో పాల్గొంటాడు. వరుణ్ చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. అండర్–12, అండర్–16 జట్లలో స్థానం పొంది సౌత్ జోన్ తరపున ఆడాడు.వరుణ్‌కు తల్లిదండ్రులు నరసింహులు, ఉమతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పాడుబడ్డ మిల్లులో పాడుపని



అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మిల్లు

రైల్వేకోడూరు : మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని ప్రధాన రహదారి ప్రక్క ముగ్గురాళ్ల మిల్లులో అసాంఘిక కార్యక్రలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. నిత్యం కొందరు బైక్‌లు, ఆటోల్లో యువతులను తీసుకువస్తున్నారని, ఆ మార్గంలో తిరగలేక ఇబ్బంది పడుతున్నామని కొందరు తెలిపారు. పోలీసులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

దళారీకి కమీషన్.. రైతన్న పరేషాన్

- జాక్‌పాట్ పేరుతో టమాట రైతులకు దగా
- వందకు 20 క్రేట్లు, పదిశాతం కమీషన్ వసూలు
- రోజూ సుమారుగా రూ.4.80 లక్షల దోపిడీ

టమాటా మార్కెట్లలో రైతులను నిలువునా దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలవుతోంది. జాక్ పాట్ పేరుతో వ్యాపారులు కుమ్మక్కై అన్నదాతను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతు తెచ్చిన వంద క్రేట్ల టమాటాకుగానూ, 20 క్రేట్ల వరకు దోచేయడమేగాక, పది శాతం కమీషన్ దండుకుంటున్నారు. ప్రతి రోజూ ఈ లెక్కన రూ.4.80 లక్షల వరకు దళారుల పాలవుతోంది. రైతన్న లబోదిబోమంటున్నాడు.



మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ రద్దు అని బోర్డులు పెట్టిన దృశ్యం



వేలంపాట సమయంలో క్రేట్లపై పోసిన టమాటాలు

గుర్రంకొండ: పడమటి మండలాల్లో మదనపల్లె తర్వాత గుర్రంకొండ మార్కెట్ అది పెద్దది. ఇక్కడ వ్యాపారులు, దళారీలు పాడిందే పాట. మార్కెట్ యార్డులో ప్రభుత్వ నిబంధనలు అమలు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై వేధింపులకు దిగుతున్నారు. నిత్యం 40 నుంచి 50 లారీల టమాటాలు మార్కెట్‌కు తరలిస్తారు. సుమారు 30 వుండీలు నిర్వహిస్తారు. దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. అయితే స్థానిక వ్యాపారులు జాక్‌పాట్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. జాక్ పాట్ ఉండకూడదనే ప్రభుత్వ నిబంధనకు పాతరవేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి వంద క్రేట్లకు 20 క్రేట్లు వదలాలని ఒత్తిడి చేస్తున్నారు. అంతేగాక వేలంపాటకు సిద్ధంగా ఉంచిన క్రేట్లపై మరో పది క్రేట్లు ఎత్తుగా పోస్తున్నారు. మళ్లీ వేలంపాటల సమయంలో వందకు పది క్రేట్ల వరకు తీసుకుంటున్నారు. ఈ లెక్కన వందకు 20 క్రేట్లు దోచుకొంటున్నారు.

పదిశాతం కమీషన్ వసూలు

జాక్‌పాట్‌ల దోపిడీ ఒకవైపు అయితే.. మరోవైపు బిల్లు వేసేటప్పుడు పది శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉంది. ప్రతి మండీ వద్ద ఇప్పటికీ నాలుగు శాతం మాత్రమే కమీషన్ అనే బోర్డులు ఉన్నాయి. అయితే అవి పేరుకే గానీ, నిబంధనలు అమలు కాలేదు. టమాటా దిగుబడులను తీసుకొచ్చే రైతుల వద్ద 10 శాతం కమీషన్‌తోపాటు క్రేట్ కూలీ రూ.2, క్రేట్ బాడుగ రూ.2 వసూలు చేస్తున్నారు. దీంతో దిగుబడి మార్కెట్ యార్డుకు చేరేసరికి కోత కూలీ, రవాణా ఖర్చులు, వుండీల ఖర్చులు కలిపి క్రేట్‌కు రు. 24 నుంచి రూ. 30 వరకు వస్తోంది.

గుర్రంకొండ మార్కెట్ యార్డుకు 60 టన్నుల టమాటా వస్తే.. 12 టన్నుల వరకు దళారులు దోచుకుంటున్నారు. వీటిని 25 క్రేట్ల రూపంలోకి మార్చితే 480 క్రేట్లు అవుతాయి. మార్కెట్లో 25 కిలోల క్రేట్ ధర అత్యధికంగా రూ.1000 పలుకుతోంది. ఈ మేరకు రూ.4.80 లక్షలు నిత్యం దోచుకొంటున్నారు.

దళారులు.. పాడిందే పాట

మార్కెట్ యార్డులో దళారులు పాడిందే పాటగా మారింది. బయట ప్రాంతాల్లో ధర ఎలా ఉన్నా ఇక్కడి వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి ఒకే ధర నిర్ణయించేస్తున్నారు. అన్ని మండీల్లోనూ అవే ధరలతో వేలం పాడుతుండడంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. జాక్ పాట్‌పై గానీ, పది శాతం కమిషన్లపై ప్రశ్నించే రైతులపై దళారులు కక్ష కడుతున్నారు. రైతులు తెచ్చిన టమాటాలను మార్కెట్ ధర కంటే 50శాతం తక్కువకే వేలం పాడి వేధిస్తున్నారు. పాడిన డబ్బుల కొసం రోజుల తరబడి తిప్పుకొంటూ నానా కష్టాలకు గురిచేస్తున్నారు.

వేలంపాట ధరలోనూ కోత

మార్కెట్ యార్డులో మండీల్లో వేలం పాట పాడిన ధరల్లో మళ్లీ కోత విధిస్తున్నారు. రూ.1000 క్రేట్ ధర పలుకుతుంటే వేలం పాటలో అవే ధరలు పాడి మళ్లీ రసీదుల్లో లెక్క కట్టే సమయంలో రు. 50 నుంచి రూ.100 వరకు కోత విధిస్తున్నారు. అందరిముందర ఒక ధర పాడుకొని బిల్లుల్లో మాత్రం కోత విధిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఓవైపు జాక్ పాట్, మరో వైపు పది శాతం కమీషన్లు, మళ్లీ వేలంపాట ధరల్లో కోతలు దీంతో రైతు అన్ని విధాలా నష్టపోతున్నారు.

జాక్‌పాట్‌తో తీరని నష్టం



రైతులు జాక్‌పాట్‌తో నష్టపోతున్నారు. మొదట పది క్రేట్‌లకు ఒక క్రేట్ జాక్‌పాట్‌గా తీసుకొంటున్నారు. తరువాత క్రేట్లపై పదికి ఒకటి చొప్పున ఎత్తుగా పోస్తున్నారు. జాక్‌పాట్ పెట్టకపోతే వేలంపాటల్లో ధరలు మరోలా ఉంటున్నాయి. గతంలోనూ రైతులు ఆందోళన చేస్తే కొనుగోలు చేయకుండా వేధించారు.

– గయాజ్ అహ్మద్, గుర్రంకొండ, గుర్రంకొండ మండలం

పది శాతం కమీషన్ వసూలు



టమాటా ఉండీల్లో వేలం పాట పాడుకొన్న మొత్తం డబ్బులో పది శాతం డబ్బులు కమీషన్ల కింద తీసుకొంటున్నారు. నాలుగు శాతం మాత్రమే తీసుకుంటామని బోర్డులు పెట్టి అదనంగా ఆరు శాతం వసూలు చేస్తున్నారు. వేలంపాటలో పాడుకొన్న ధర కంటే తగ్గించి లెక్కగట్టి బిల్లులు ఇస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

– రామకృష్ణారెడ్డి, దౌలత్‌ఖాన్‌పల్లె

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గుర్రంకొండ యార్డులో జాక్‌పాట్ పేరుతో రైతులను దోచుకొంటున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. సమస్య పరిష్కరిస్తాం. – కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : చిల్లర దుకాణంలో వస్తువులు కొనడానికి వచ్చి గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం జరిగింది. పట్టణానికి సమీపంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన రామాచారి భార్య రత్నమ్మ(55) స్థానికంగా చిల్లర దుకాణం నిర్వహిస్తోంది. యథావిధిగా తెల్లవారుజామున ఉదయం ఐదు గంటలకు షాపు వద్దకు వచ్చిన ఓ వ్యక్తి వాటర్ ప్యాకెట్, గ్లాసు కావాలంటూ అడిగి రూ.50 నోటు ఇచ్చాడు. రత్నమ్మ ప్యాకెట్ ఇచ్చేందుకు యత్నిస్తుండగా ఆమె మెడలో గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆమె చైన్ గట్టిగా పట్టుకుని అరవడంతో తెంపుకొని వెళ్లిపోయాడు. బాధితురాలు రత్నమ్మ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగల రూ.1.10 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ ఎస్.శేఖర్ తెలిపారు.

ట్రిప్లెట్స్ జన్మదిన వేడుక



ట్రిప్లెట్స్‌తో అధ్యాపకులు

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుకొంటున్న ట్రిప్లెట్స్(సోదరి, సోదరులు) జన్మదిన వేడుక గురువారం జరిపారు. ములకలచెరువు మండలం కాలువపల్లెకు చెందిన తేజమూర్తి, చంద్రకళ దంపతులు 2006 మే, 30న ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. కార్తిక్, కుసుమాంజలి, కళ్యాణ్ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం బీకాం కంప్యూటర్స్ చదువుతున్నారు. వీరి జన్మదినం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ప్రసాద్ కేక్ కట్ చేయించారు. కవలలైన సోదరి, సోదరులు ఒకే కళాశాలలో, చదువుతుండటం తెలుసుకుని వారిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం



కలకడలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోతున్న బంకు

కలకడ : విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి, రూ.1.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు సైపుల్లా తెలిపారు. బాదితుడి కథనం మేరకు కె.వి.పల్లె మండలం, చీనేపల్లెకు చెందిన సైపుల్లా జీవనోపాధి కోసం కలకడ అంకాలమ్మ చెరువులో మట్టిని పూడ్చి రేకుల షెడ్ సిద్ధం చేసుకుని సీటు కవర్ల వ్యాపారం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. బంకులోని సీటు కవర్లు, మెటీరియల్, కుట్టు మిషన్ కాలిపోయాయని, రూ.1.5 లక్షలు నష్టపోయానని సైపుల్లా తెలిపారు.

22 గ్యాస్ సిలిండర్లు సీజ్



సీజ్ చేసిన సిలిండర్లతో రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట : గృహ అవసరాల కోసం సరఫరా చేసే గ్యాస్ సిలిండర్లను బి.కొత్తకోటలో వాణిజ్య అవసరాలకు వినియోగిస్తుండటంతో రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించారు. స్థానిక రంగసముద్రం రోడ్, బీరంగిరోడ్, మెయిన్ రోడ్డుల్లోని హోటళ్లపై దాడులు జరిపి 22 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. వారిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో వీఆర్‌ఓలు అమర, అశోక్, హైదర్ పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం చెర్లోపల్లె సమీపంలోని కడప – రేణిగుంట జాతీయ రహదారిపై ఓ లారీ వేగంగా కారును ఢీకొనడంతో దెబ్బతింది. ఓబులవారిపల్లె గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి సొంత పని మీద హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. చెర్లోపల్లి వద్దకు రాగానే వెనుకవైపు నుంచి అతివేగంగా ఓ లారీ ఢీకొనడంతో ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయణిస్తున్న సందీప్ రెడ్డికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం గురించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడు అరెస్టు

- ప్రేమ పేరుతో 13 ఏళ్ల బాలికకు వంచన
- పెళ్లి చేసుకోమంటే భార్య, పిల్లలున్నారని నిరాకరణ



అరెస్టయిన ఆంజనేయులు

బి.కొత్తకోట : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు పరచాల్సిన ఉపాధ్యాయుడే.. కీచకుడిగా మారాడు. 13 ఏళ్ల విద్యార్థిని మాయ చేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. పెళ్లిచేసుకోమంటే.. తనకు భార్య, పిల్లలున్నారంటూ చెప్పి తప్పుకున్నాడు. చివరికి బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కీచక ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సూర్య నారాయణ వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పెద్దతిప్పసముద్రం మండలం మల్లెలకు చెందిన జి.ఆంజనేయులు (33) గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో చదువుతూ చురుగ్గా మాట్లాడే ఓ 13 ఏళ్ల బాలికపై కన్నేశాడు. ప్రేమ, పెళ్లి అంటూ మాటలు చెప్పి మొబైల్‌లో మాట్లాడుతూ, మెసేజ్ పంపుతూ మాయ చేశాడు. ఈ నెల 4న బి.కొత్తకోటకు వచ్చిన అంజి.. బాలికకు ఫోన్‌చేసి నువ్వు రాకుంటే ఏమైనా తీసుకుని చనిపోతానంటూ బెదిరించాడు. దీంతో బాలిక ఇంటినుంచి రాగా..బెంగళూరులో ఉంటున్న బంధువు ఇంటికి తీసుకెళ్లి పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అదృశ్యం కావడంతో తల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. కేసు నమోదు విషయం తెలుసుకున్న బాలిక తనను పెళ్లి చేసుకోవాలని అంజనేయులుపై ఒత్తిడి చేసింది. తనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారని చెప్పి నిరాకరించాడు. తర్వాత ఇంటికి చేరుకున్న బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో పోలీసులు ఫిర్యాదు చేశారు. అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి బి.కొత్తకోట సమీపంలోని మల్లెల క్రాస్‌లో అంజనేయులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట గ్రామం తోట వీధికి చెందిన రవికుమార్ భార్య తులశమ్మ(30) అనారోగ్యంతో ఇంటివద్దే లైజాల్ (ఇంటి శుభ్రం చేసే ద్రవపదార్థం) తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ మంచిగుంటపల్లెకు చెందిన రెడ్డప్ప కుమార్తె వందన (20) కుటుంబసమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు పి.చంద్ర(34) తన భార్య కాపురానికి రాలేదనే మనస్థాపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా మదనపల్లె పట్టణంలోని శ్రీవారినగర్‌కు చెందిన వెంకట రమణ కుమారుడు అనిల్‌కుమార్(26) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబసమస్యలతో మనస్థాపం చెంది ఇంటి వద్దే పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనాల ద్వారా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులపై కుక్కల దాడి



కుక్కకాటుకు గురైన విద్యార్థి విజయ్

రాజంపేట : చిన్నారులపై కుక్కలు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. రాజంపేట పట్టణం లోని ఉస్మాన్ నగర్‌లో రెండో తరగతి చదువుతున్న బాలుడు ఆహిల్ బంతితో ఆడుకుంటున్నాడు. బంతి బయటపడడంతో దానిని తీసుకునేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న కుక్క బాలుడిపై దాడి చేసి కరిచింది. స్థానికులు అడ్డుకుని కుక్కను తరిమికొట్టారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని అమర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాజంపేట మునిసిపల్ కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ 300 కుక్కలను పట్టి టీకా వేసి దూరంగా తరిమేస్తున్నామని తెలిపారు.

బార్లపల్లెలో మరో బాలుడిపై...

మదనపల్లె : మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు ఎం.విజయ్(14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్క ఆకస్మాత్తుగా దాడి చేసి కరిచింది. విద్యార్థిని కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

రైతు భరోసా కేంద్రానికి తాళం



కేవీపల్లె : అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం నూతన కాల్వ రైతు భరోసా కేంద్రానికి(ఆర్‌బీకే) రైతులు గురవయ్య, సిద్దయ్య, సి.కె. వెంకటరమణారెడ్డి, వి.చంద్ర, వి.మురళి, ఆదిరెడ్డి తదితరులు గురువారం తాళం వేశారు. వారు మాట్లాడుతూ రాయితీ వేరుశనగ విత్తనకాయలను అక్కడ పనిచేస్తున్న వీఏఏ మౌనిక ఇతర వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తాము కాయలు అడిగితే స్టాకు తక్కువగా చూపారని తెలిపారు. 600 బస్తాల రాయితీ వేరుశనగ కేటాయించగా, 400 బస్తాలు ఇచ్చినట్లు నమోదు చేశారని, విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బసిని కొండకు చెందిన చైతన్య(25) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

చెట్టుపై నుంచి పడి..

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి ఓ విద్యార్థి గాయపడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన విద్యార్థి కార్తిక్(13) టెంకాయలు కోసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ పై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

రాజంపేట సబ్‌జైల్ పరిశీలన

రాజంపేట : రాజంపేట సబ్ జైల్‌ను కడప న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది గురువారం పరిశీలించారు. జైలులో ఖైదీలను విచారించి, పరిసరాలు తనిఖీ చేశారు. వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లు చూసి ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

మదనపల్లె : పట్టణంలోని సంతగేట్ సమీపంలోని చంద్ర విలాస్ వద్ద నవాజ్ స్టవ్ దుకాణంలో గురువారం మధ్యాహ్నం ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం జరిగింది. యజమాని నవాజ్ అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారుగా రూ.10 వేల నష్టం వాటిల్లినట్లు నవాజ్ తెలిపారు.

ఇంటి సామగ్రి ధ్వంసం

బి.కొత్తకోట : మండలంలోని దిన్నిమీదపల్లెకు చెందిన విశ్వనాథ్‌పై కొందరు దాడిచేసి ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశారు. ఏఎస్ఐ బొజ్జి నాయక్ వివరాల మేరకు.. ఘర్షణ జరగడంతో కోటావూరు పంచాయతీ చౌటకుంటపల్లెకు చెందిన పి.శేఖర్, అతని కుమారుడు వినోద్ మరింత మంది దిన్నిమీదపల్లెకు చెందిన విశ్వనాథ్‌ను కొట్టారు. తర్వాత ఫ్రిడ్జ్, ఇతర సామగ్రి ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టూరిస్టు గైడ్ మృతి



వెంకటరమణ (ఫైల్)

కలికిరి : మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం పాత హరిజనవాడకు చెందిన టూరిస్టు గైడ్ ఎ.వెంకటరమణ(65) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో గురువారం మృతి చెందాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తెలుగు ప్రజలను దేశం నలుమూలల్లోని దైవ క్షేత్రాలకు తీసుకెళుతూ టూరిస్టు గైడ్‌గా పని చేస్తున్న ఆయన ఓ బృందంతో ఇటీవల అయోధ్య, వారణాసి పర్యటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా లక్నో రైల్వే స్టేషన్ పరిధిలో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.

రెండు స్కానింగ్ కేంద్రాల సీజ్

మదనపల్లె : అన్నమయ్య జిల్లా డిప్యూటీ డెమో దేవశిరోమణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.లక్ష్మీ పట్టణంలోని తిరుమల, శ్రీహాస్పిటల్, తేజస్విని, భాస్కర్‌రెడ్డి ఆర్థో, రెయిన్‌బో, జ్యోత్స్న మెటర్నిటీ ఆస్పత్రులలో గురువారం తనిఖీలు నిర్వహించారు. తిరుమల ఆస్పత్రిలో వసతులు, సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. ఆదిత్య స్కాన్ సెంటర్, సాయిసంజీవిని కిడ్నీ ఆస్పత్రిలోని స్కాన్ సెంటర్లను సీజ్ చేశారు. నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

గుట్ట భూమి ఆక్రమణ

బి.కొత్తకోట : స్థానిక బీరంగి రోడ్డులోని పెయింటర్స్ కాలనీ, ఆదర్శ విద్యాలయం మధ్య గుట్టను ఆక్రమించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చదును చేశారు. ఇక్కడి భూమిని ఆక్రమించి, పట్టాలు విక్రయిస్తామని ప్రచారం చేస్తున్నట్లు తెలిసింది. ఖరీదైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆక్రమణ దారులకు పట్టాలున్నాయా? రికార్డుల్లో వారి పేర్లు ఉన్నాయా? పరిశీలించడం లేదు. అధికారులు స్పందించకపోతే మరింత భూమి ఆక్రమణకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. నక్కలదిన్నె తాండాకు చెందిన మునిస్వామి నాయక్ (23) స్థానికంగా సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.